క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణబాబు, ఎస్సై ఎస్‌కే జబీర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్లకూడదని, ఎక్కడైనా, ఎవ్వరైనా ప్రజా శాంతికి భంగం కలిగించి ఏదైనా సమస్యలు సృష్టిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్‌లు, అనుమానిత వ్యక్తులు తమ సత్ ప్రవర్తన అలవర్చుకుని ఉన్నతంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయించుకోండి

కామవరపుకోట: త్వరలో జరగనున్న ఉభయగోదావరి జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి ఓటర్ నమోదు గడవు నవంబర్ 6వ తేదీతో ముగుస్తుందని తహసీల్దార్ జి.ఎలీషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 2021 సవంత్సరం ముందు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు అని, వారు ఆన్‌లైన్‌లో లేదా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నమూనా ఫారం పూర్తి చేసి దరఖాస్తును తహసీల్దార్ కార్యాలయంలో అందజేయవచ్చునన్నారు. చదువుకున్న యువత రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా నమోదు చేసుకుని ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జంగారెడ్డిగూడెం బాలికలు



చెస్ పోటీలకు ఎంపికైన బాలికలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం చెందిన బాలికలు రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. భీమవరంలో ఈనెల21న ఏపీ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాస్థాయి చెస్ పోటీలు అండర్ 17 బాలికల విభాగంలో నిర్వహించారు. ఈ పోటీల్లో జంగారెడ్డిగూడెం దివ్యాస్ మాస్టర్స్ చెస్ అకాడమీ ప్లేయర్స్ మేడిచర్ల తన్మయి, తురసం శశి ప్రియాంక ప్రతిభ కనపరిచి బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌కి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తరపున ఎంపికయ్యారు. చెస్ అకాడమీ నిర్వాహకురాలు అయినపర్తి సరళా మాధవి, రోటరీ సభ్యులు ఎ.చంద్రశేఖర్, జె.ఉమావెంకటేష్ బాలికలను అభినందించారు.

రోడ్డుపై దుమ్ముతో ఇబ్బందులు



వాహనాలు వెళ్తుండడంతో పైకి లేచిన దుమ్ము

కుక్కునూరు: కుక్కునూరు, బూర్గంపాడు ఆర్ అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ రోడ్డుపై నీరు చల్లించకపోవడంతో వాహనాల రాకపోకలతో రోడ్డుపై దుమ్ము లేచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డును తవ్వి వెట్ మిక్స్ వేయించిన అనంతరం రోడ్డుపై నీరు చల్లించకపోవడంతో వచ్చిపోయే వాహనాలకు తీవ్రంగా దుమ్ము లేస్తోంది. దీంతో అల్లిగూడెం గ్రామస్తులు ఆదివారం వాహనాలను ఆపి నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై నీరు చల్లనిదే వాహనాలను నడవనివ్వమని చెప్పడంతో కాంట్రాక్టర్ దిగొచ్చి నీరు చల్లించినట్టు సమాచారం.

గరికపాటి ఆర్ట్స్ సేవలు చిరస్మరణీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో కళలను ఆదరిస్తూ, కళాకారులను విశేషంగా ప్రోత్సహిస్తున్న గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సేవలు చిరస్మరణీయమని సినీ విజ్ఞాన విశారద, నంది అవార్డు గ్రహీత ఎస్‌వీ రామారావు అన్నారు. ఆదివారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి, పుల్లాభొట్ల శ్రీరామమూర్తి ప్రాంగణంలో గరికపాటి ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఎస్ఆర్ పురస్కార ప్రదాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కళా సంస్థ 50 కార్యక్రమాలు నిర్వహించడమే విశేషంగా చెప్పుకుంటామని, అలాంటిది గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సంస్థ ఇప్పటి వరకూ 269 కార్యక్రమాలు నిర్వహించడం ఒక రికార్డుగా నిలుస్తుందన్నారు. ఏఎస్ఆర్ పురస్కార గ్రహీత గుడిపాటి లలిత మాట్లాడుతూ తనను ఏఎస్ఆర్ పురస్కారానికి ఎంపిక చేయటం ఆనందదాయకమన్నారు. అనంతరం నగరానికి చెందిన వేదుల జయలక్ష్మి, గుడిపాటి రత్న శిరీష గుడిపాటి విశ్వనాథ్ ఆలపించిన లలిత సంగీత కార్యక్రమంగా అమ్మవారి కీర్తనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి వారికి పి.సుధీర్, కె.కల్యాణ్ (తబలా) వాయిద్య సహకారం అందించారు.

సంక్షేమ గృహాలు.. సంక్షోభాలకు నిలయాలు

- పాత భవనాల్లోనే సంక్షేమ హాస్టళ్లు
- అధ్వానంగా మౌలిక సదుపాయాలు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు



పాతూరు రోడ్డులో రేకుల షెడ్డులోనే ఎస్సీ బాలుర వసతి పాత భవనం



కామవరపుకోటలో అద్దె భవనంలో బీసీ వసతి గృహం

కామవరపుకోట: ప్రభుత్వ వసతి గృహాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాత భవనాల్లోనే హాస్టళ్లు నిర్వహిస్తుండడం, కనీస మౌలిక సదుపాయాలు కొరవడడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంక్షేమ హాస్టళ్ల పాత భవనాలు పెచ్చులూడి దర్శనమిస్తున్నాయి. మండలంలో మూడు సంక్షేమ వసతి గృహాలకు గాను, బాలికల వసతి గృహం ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తున్నారు. బాలుర ఎస్సీ, బీసీ, వసతి గృహలను పాత భవనాల్లో సుమారు 25 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఎస్సీ బాలుర వసతి గృహం ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తుండగా దీనిలో 95 మంది విద్యార్థులు ఉన్నారు. బీసీ బాలుర వసతిగృహం అద్దె భవనంలో నిర్వహిస్తుండగా ఇందులో 45 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఎస్సీ వసతి గృహం నిర్వహిస్తున్న భవనం గతంలో ప్రభుత్వ ఆసుపత్రిగా ఉండేది. అది శిథిలావస్థకు చేరడంతో సమీపంలో కొత్త భవనాన్ని నిర్మించి ఆస్పత్రిని అక్కడికి తరలించారు. తరువాత ఆ పాత భవనానికి చిన్నచిన్న మరమ్మతులు నిర్వహించి అక్కడే హాస్టల్ నిర్వహిస్తున్నారు. బీసీ వసతిగృహం నెలకు రూ.19 వేలు అద్దె చెల్లించి పాత భవనంలో నిర్వహిస్తున్నారు. ఇవి పాత భవనాలు కావడం వలన, గోడలు పెచ్చులూడి దర్శనమిస్తున్నాయి. వీటిలో చాలీచాలని గదులతో ఒకే గదిలో పదిమందికి పైగా విద్యార్థులు అసౌకర్యంగా ఉండాల్సిన పరిస్థితి. వర్షాకాలం వచ్చిందంటే పాత భవనాలు లోతట్టుగా ఉండి డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గాలేక వర్షపు నీరు బయటకు వెళ్లకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ హాస్టల్లో భవనాలకు సరైన తలుపులు, కిటికీలు లేవు. దీంతో సరైన వెలుతురు లేకపోవడం, వర్షాకాలంలో చలితో ఇబ్బంది పడుతున్నారు, మరమ్మతుల సమయంలో ఈ పాత భవనాల పైకప్పుకు రేకులు వేయడం వలన రాత్రి సమయంలో వర్షం కురిస్తే, రేకుల శబ్దానికి నిద్ర పట్టడం లేదని బిక్కుబిక్కుమంటూ నిద్రపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఈ వసతి గృహాల్లో సరైన మంచినీటి సదుపాయం కూడా లేదు. సౌకర్యాలు లేని ఇలాంటి హాస్టల్లో చేరాలంటే గ్రామీణ ప్రాంతా విద్యార్థులు ఆసక్తి చూపటం లేదు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు మేలు చేసే విధంగా హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న ఎస్సీ బాలుర వసతిగృహం భవనం గోడ →

నిధులు కేటాయించాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థకు పెద్దపీటవేసి నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. అదే మాదిరి పేద విద్యార్థులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం నిధులు కేటాయించి, వారి వసతి కొరకు కొత్త భవనాలను నిర్మించడంతోపాటు, హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలి.

– కడిమి రమేష్, జెడ్పీటీసీ, కామవరపుకోట

ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలి



హాస్టల్లో సరైన మంచి నీటి సదుపాయం లేదు. వర్షాకాలంలో కలుషిత నీటిని తాగటం వలన డయేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల బారిన పడి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాం. హాస్టల్లో మంచి నీటి సదుపాయం కల్పించేలా ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలి.

– సంకసాని రిషిక్, విద్యార్థి, ఎస్సీ వసతి గృహం

కొత్త భవనం నిర్మించాలి



వర్షాకాలం వచ్చిందంటే రాత్రి సమయంలో వర్షం కురిస్తే, భవనం పై కప్పుగా వేసిన రేకుల శబ్దాలకు నిద్ర పట్టడం లేదు. ఈ భవనానికి సరైన తలుపులు, కిటికీలు లేక, సరిగ్గా వెలుతురు రాకపోవడంతో పాటు రాత్రి సమయంలో అసౌకర్యంగా ఉంటుంది. పాత భవనాన్ని తొలగించి ఆ స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించాలి

– గద్దల చందు, విద్యార్థి, ఎస్సీ వసతి గృహం

2 నుంచి కార్తీక మాసోత్సవాలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో నడిబొడ్డున వేంచేసి ఉన్న శ్రీ పంచభూత మరకత లింగేశ్వర సహిత శ్రీ చక్ర సమన్విత శ్రీశ్రీశ్రీ విజయదుర్గమ్మవారి ఆలయంలో నవంబర్ 2వ తేదీ నుంచి కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. పంచభూత మరకత లింగేశ్వరునికి నిత్యం పంచామృతాలతో అభిషేకాలు, పార్థివ శివలింగానికి సోమవారాల్లో ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 29వ తేదీన శివపార్వతుల కల్యాణం, అనంతరం లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

రూ.99కే మందు... నాణ్యత నిల్

మందుబాబుల పెదవి విరుపు



కూటమి సర్కారు విడుదల చేసిన నాణ్యత లేని మందు సీసాలు



కన్నాపురంలో రూ.99 మందు కోసం ఎగబడుతున్న మందుబాబులు

కొయ్యలగూడెం: రూ.99కే మందు వచ్చేసిందోచ్ అంటూ మందు బాబులు పండుగ చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం పేర్కొన్న విధంగా రూ.99కే మద్యం బాటిళ్ల కోసం ఎదురు చూసిన వీరు.. ఆదివారం ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలోని ఐదు షాపుల్లో రూ.99 క్వార్టర్ బాటిళ్లు సమృద్ధిగా రావడంతో వాటిని కొనుగోలు చేయడానికి క్యూ కట్టారు. కన్నాపురంలోని షాపు వద్ద ఎగబడి గంటల తరబడి నిలబడి ఈ మందుబాటిళ్లను కొనుగోలు చేయడం కనిపించింది. రూ.99కే నాణ్యత గల మద్యం అందిస్తామన్న కూటమి ప్రభుత్వం.. తీరా ఆచరణలో నాణ్యత లేని మందుబాటిళ్లను సరఫరా చేసిందంటూ వీటిని కొనుగోలు చేసిన అనంతరం మందుబాబులు మండిపడుతున్నారు.

ఏజెన్సీలో పెరుగుతున్న చలిగాలులు

బుట్టాయగూడెం: ఏజెన్సీప్రాంతంలో గత నాలుగు రోజులుగా చలి విజృంభిస్తుంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. పగలంతా తీవ్రమైన ఎండలు దంచికొడుతుంటే సాయంత్ర సమయానికి చలిగాలులు వీస్తున్నాయి. అదేవిధంగా తెల్లవారుజామున పొగమంచు కమ్ముకుంటుంది. చలితీవ్రత పెరుగుతున్నందున శ్వాసకోస సంబంధిత వ్యాధులు ఉన్నవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

కుక్కునూరు: పెద్దరావిగూడెం గ్రామంలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఆదివారం కుక్కునూరు పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో కోడి పందేలు ఆడుతున్న పోలగాని శివప్రసాద్, పోలగాని రాంబాబు, కటారి వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసినట్లు కుక్కునూరు ఎస్సై రామకృష్ణ తెలిపారు. నిందితుల నుంచి రెండు కోడి పుంజులు, రూ.35 వేల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శ్రీనివాసపురంలో దాడులు

జంగారెడ్డిగూడెం: కోడిపందేలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్సై ఎస్‌కే జబీర్, తన సిబ్బందితో కలిసి శ్రీనివాసపురం గ్రామ శివారులో దాడులు నిర్వహించి కోడిపందేలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి ఒక కోడి, కోడికత్తి, రూ.4800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

నాగిరెడ్డిగూడెంలో...

చింతలపూడి: చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో కోడి పందేలపై ఆదివారం స్థానిక పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 6గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.8,100 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుటుంబరావు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

జంగారెడ్డిగూడెం: పేకాట స్థావరాలపై జంగారెడ్డిగూడెం పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. స్థానిక ప్రతిభ స్కూల్ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.7,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే స్థానిక గరుడపక్షి నగర్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 2200 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదభరితంగా డ్రెయిన్లు



ప్రమాదభరితంగా మొహిద్దీన్‌కుంట చెరువు వద్ద ఉన్న డ్రెయిన్

చింతలపూడి: లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న పక్కా డ్రెయిన్లు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదభరితంగా మారుతున్నాయి. డ్రెయిన్లపై మూతలు వేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ డ్రెయిన్లలో అనేకసార్లు ప్రమాదవశాత్తూ మూగ జీవాలు పడి మత్యువాత పడ్డ సంఘటనలు కోకొల్లలు. చింతలపూడి మొహిద్దీన్ కుంట చెరువు నుంచి సుమారు రూ.9.50 లక్షలతో డ్రెయిన్ నిర్మించారు. అయితే డ్రెయిన్ పైన ఎలాంటి రక్షణ కవచం లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తక్షణం డ్రెయిన్లపై సిమెంటు రాళ్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కారు డ్రైవర్ల నూతన కమిటీ ఎన్నిక



కారు డ్రైవర్ల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: కార్మికుల సమస్యల సాధనకు ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బుచ్చిబాబు అన్నారు. వేలేరుపాడు సీపీఐ కార్యాలయంలో ఆదివారం మండల కార్యదర్శి కారం దారయ్య అధ్యక్షతన ఏఐటీయూసీ ఆల్ ఇన్ వన్ కారు డ్రైవర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ డ్రైవర్ల సంఘానికి జిల్లా నాయకత్వం ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆల్ ఇన్ వన్ కారు డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేల్పుల సూరిబాబు, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ హుస్సేన్ ఖాన్, కార్యదర్శిగా తొర్లకుంట హనుమంతరావు, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ జాకీర్ ఖాన్, కోశాధికారిగా వంగ పండు రాంబాబు, కమిటీ సభ్యులుగా నిమ్మగడ్డ వెంకటేష్, తెల్లం శ్రీను, వీరితోపాటు 30 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, మండల కార్యదర్శి బాడిశ రాము తదితరులు పాల్గొన్నారు.

సాగు సాయం కోసం ఎదురుచూపు

- ఏటా.రూ.20 వేల సాయం అందిస్తామని ఎన్నికల్లో హామీ
- అందలం ఎక్కాక ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- పథకాలను అమలు చేయాలని కోరుతున్న రైతులు



ధర్మాజీగూడెంలో ఏపుగా పెరిగిన వరి చేను

లింగపాలెం: ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి సాయం ఏటా రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చిన టీడీపీ కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. అన్నదాత సుఖీభవ రూ 20 వేల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ కాలేదు. దీంతో రైతన్నలు పంటలను సాగు చేసేందుకు అయినకాడికి అప్పులు చేయాల్సిన పరిస్థితి. చింతలపూడి నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. గత 20 ఏళ్లుగా వ్యవసాయం తీవ్ర వడిదుడుకులకు లోనవుతుంది. కరువు కారణంగా పంటలు పండినా గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రకృతి విపత్తు, మార్కెట్ ఒడిదుడుకుల మధ్య వ్యవసాయం గిట్టుబాటుకాక రైతులు అప్పులపాలైతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రైతుకు రూ.2.50 లక్షల అప్పులున్నాయి. సగటు రైతు కుటుంబం అప్పుల నుంచి బయటకు రాలేకపోతుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సున్నా వడ్డీ, పావలా వడ్డీ కూడా పూర్తిగా ఆదుకోలేకపోతుంది. గతంలో నారా లోకేష్ వ్యవసాయ మీటర్లు ఉన్న మోటార్లను పగలకొట్టమని పిలుపునిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ ఊసెత్తడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాల్గు నెలలు గడుస్తుంది. ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి పదవి పొందాక చంద్రబాబు ఎందుకు అమలు చేయలేక పోతున్నారని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు.

రైతు భరోసా ఆదుకొనేది

గత నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా రైతు భరోసా పథకం కింద రూ.13,500 రైతులకు అందజేసింది. దీంతో రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేదికాదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రూ.20 వేలు ఇస్తామని ఊదరగొట్టి ఇప్పుడు మౌనం వహిస్తోంది. దీంతో ఏం చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి అప్పులపాలవుతున్నారు. పంటల బీమా పథకం, అన్నదాత సుఖీభవ సాయం ఇవ్వకపోతే పంటలను ఎలా సాగు చేయాలంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా రైతును ఉద్ధరించేది అంటూ చంద్రబాబు తీరుపై రైతులు మండిపడుతున్నారు. జీవో 22ను రద్దు చేయాలని, 2023 ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు బీమా పరిహారం ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ, పంటబీమా పథకం అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి. పెట్టుబడి సాయం అందించాలి. విపక్షకు తావులేకుండా రైతు పథకాలు అన్నింటినీ అంకితభావంతో ప్రతి రైతుకు అందేలా అమలు చేయాలి. రైతులందరికీ న్యాయం చేయాలి.

– సీహెచ్ నాగలింగాధరావు, రైతు, కొణిజర్ల

అర్ధాంతరంగా నిలిచిన ఆలయాల పనులు



పరింపూడి ఎనిమిదవ వార్డులో అభివృద్ధికి నోచుకోని రామాలయం



అచ్యుతాపురంలో అసంపూర్తిగా శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ పనులు



కొయ్యలగూడెంలో నిర్మాణంలో ఉన్న శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయం

- గత ప్రభుత్వంలో ఆలయాల నిర్మాణాలకు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధుల మంజూరు
- ప్రస్తుతం నిధుల విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
- అసంపూర్తిగా నిలిచిన ఆలయాల పునర్నిర్మాణ పనులు
- భగవంతుని విషయంలో రాజకీయాలను ముడిపెట్టవద్దని భక్తుల వినతి

కొయ్యలగూడెం: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన నూతన ఆలయాల నిర్మాణ, పునర్మిరాణ పనులు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. జీర్ణావస్థలో ఉన్న ఆలయాల నిర్మాణానికి, మరికొన్ని చోట్ల పునర్నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ నిధులు వినియోగించాల్సి ఉంది. పోలవరం నియోజకవర్గంలో మొత్తం ఏడు మండలాలకు కలిపి 22 ఆలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా మొదటి విడతలో 8 ఆలయాల నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ గత జనవరిలో రూ.80 లక్షలు మంజూరు చేసింది. ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున ఆలయ నిర్మాణ అభివృద్ధి పనులకు కేటాయించగా మిగిలిన సొమ్ములు ఆయా ఆలయాలకు చెందిన మూల నిధి నుంచి లేదా దాతల నుంచి సమకూర్చుకోవలసి ఉంది. మంజూరైన 8 పునర్నిర్మాణ ఆలయాలకు సంబంధించి కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలంలో 8 ఆలయాల నిర్మాణానికి పాలక వర్గాలు పనులు ప్రారంభించాయి. అయితే ఎన్నికల కోడ్ నిబంధనల వలన నిలిచిపోయిన నిధుల పంపిణీ, అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సంబంధిత నిధులను విడుదల చేయకపోవడంతో ఆలయాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా పునర్ నిర్మించనున్న ఆలయాల్లో కొయ్యలగూడెం మండలానికి గాను కన్నాపురం రోడ్డులోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయం, పరింపూడి 8వ వార్డు కోదండ రామాలయం, అచ్యుతాపురం శ్రీ అభయ ఆంజనేయస్వామి, శ్రీరంగపట్నం శ్రీ సీతారామఆలయం, ఈవిడిపాలెం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాల పునర్ నిర్మాణ పనులు చేపట్టి నిధుల కొరతతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. అదే విధంగా బుట్టాయగూడెం మండలం నందాపురంలో రామాలయం, చింతలగూడెం కనకదుర్గమ్మ ఆలయం, లంకాలపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలను శ్రీవాణి ట్రస్ట్ నిధుల మంజూరుతో స్థానిక ఆలయాల మూల నిధులను కలుపుకొని నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే నిధుల భరోసాతో జీర్ణోద్ధారణకు చెందిన ఆలయాలను తొలగించి నూతన ఆలయాల నిర్మాణాలు చేపట్టగా అవి అర్ధాంతరంగా ఆగిపోయాయి. పాలనలోకి వచ్చిన తరువాత రాజకీయాలే పరమావధిగా పనిచేసుకుపోతున్న కూటమి నాయకులు దేవుళ్లకు సైతం రాజకీయాలను ముడిపెట్టి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులను వినియోగించనీయకుండా పరోక్షంగా జాప్యం చేస్తూ వస్తున్నారని దేవాదాయ శాఖలకు చెందిన అధికారులే పేర్కొంటున్నారు. నిధుల మంజూరుపై భక్తి భావనతో ఒకటికి రెండు సార్లు అడుగుతుంటే తమపై పాలకులు కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిధుల మంజూరు విషయంలో దేవుడు వరమిచ్చినా పాలకులు కరుణించని విధంగా మారిందని భక్తులు వాపోతున్నారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నా..



ఆలయ పునర్నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ నిధుల మంజూరు కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతుంది. రోజురోజుకూ నిర్మాణ పనుల అంచనా పెరిగిపోతుండడంతో అదనపు భారం పడుతుంది.

– మద్దు గోపి, మదన గోపాలస్వామి పాలకమండలి చైర్మన్, కొయ్యలగూడెం

నిధులు నిలిచిపోయాయి



పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి గత ప్రభుత్వం సంకల్పించి టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులను మంజూరు చేయించింది. అయితే నిధులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో దేవుళ్ల విగ్రహాలకు సైతం నీడ లేకుండా పోయింది.

-టీవీఎస్ఎస్ గోపాల్, కోదండ రామాలయ పాలక మండలి సభ్యులు